ప్రజాజ్యోతి
బుధవారం 29 ఏప్రిల్ 2026 12 పేజీలు
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

# పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

రహదారుల నిధుల కోసం కేంద్ర మంత్రులను కలుస్తాం..

ధర్మపురి క్షేత్ర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష



**జగిత్యాల ప్రతినిధి,ఏప్రిల్28(ప్రజాజ్యోతి):**

రానున్న 2027 గోదావరి పుష్కరాల పనులతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులను అత్యంత వేగవంతం చేయాలని రాష్ట్ర సాంఘిక

2



# బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, సముచిత పోషకాహారం హక్కు**

**చిన్నపిల్లల హక్కుల భంగన సమస్య వస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలి**

**విద్యా నాణ్యత పెంపుతో పాటు పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి***

**పెద్దపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి;**

2

బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా *జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,* బాలల సంరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సలయ్, అంగన్వాడీ సేవలు, ప్రీప్రైమరీ విద్య, బాలల సదనాల ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, సముచిత పోషకాహారం, సురక్షిత వాతావరణం పొందే హక్కు ఉందని స్పష్టం చేశారు. ఏ చిన్నారికి అయినా సమస్యలు ఎదురైతే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలో విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు నాణ్యత పెంపుపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల చదివే సామర్థ్యం (ORF), పఠన అవగాహన (RC) వంటి సూచికల్లో గణనీయమైన మెరుగుదల నమోదైందన్నారు.

# మే 6న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహణ

**57 సంస్థలతో 1799 ఉద్యోగ అవకాశాలు లభ్యం**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి ఏప్రిల్ 28 ప్రజాజ్యోతి;**

జిల్లాలోని నిరుద్యోగ యువత కలలను సాకారం చేస్తూ, వారి ముంగిటకే ఉద్యోగ అవకాశాలను తీసుకువచ్చేందుకు జిల్లా యంత్రాంగం భారీ ఉపాధి మేళాకు శ్రీకారం చుట్టింది. జిల్లా పరిపాలన యంత్రాంగం, తెలంగాణ

2

# డ్రగ్స్ తో కలిగే దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలి

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఏప్రిల్ -28 (ప్రజాజ్యోతి)**

జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగంతో దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన

2

# గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు రైతులకు న్యాయం చేస్తాం

## ఎమ్మెల్యే విజయరమణ రావు

2



# డ్రగ్స్ తో కలిగే దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్య తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రచారంలాంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల రవాణా, సాగు,



వినియోగం నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభించామని, డ్రగ్స్ బాధితులకు చికిత్స, కౌన్సెలింగ్ పూర్తి స్థాయిలో అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.. గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తు న్నామని, అదే సమయంలో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖ, వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నామన్నారు. వివిధ షాపులలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష పేర్కొన్నారు.సమావేశంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# పుష్కరాల పనులు వేగవంతంచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన ధర్మపురి లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. 2027 పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఇప్పటికే సిద్ధం చేసిన ప్రణాళికలను మరోసారి పునః సమీక్షించుకోవాలని సూచించారు.పుష్కర పనులకు అవసరమైన నిధుల మంజూరు కోరుతూ త్వరలోనే ముఖ్యమంత్రిని కలుస్తానని మంత్రి భరోసా ఇచ్చారు.రాయపట్నం నుండి ధర్మపురి వరకు ఉన్న నేషనల్ హైవే 63 అభివృద్ధి కోసం కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి నిధులు కోరనున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా భూసేకరణకు ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులతో చర్చించి పరిష్కరించాలని, ఇందులో స్థానిక నాయకులు చొరవ చూపి ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించకూడదని, ధర్మపురి క్షేత్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




# బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు సమతుల్య పోషకాహారం అందిస్తూ, వారి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆర్.బీ.ఎస్.కే కార్యక్రమం ద్వారా పిల్లలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ, ఏ ఆరోగ్య సమస్య ఉన్నా తక్షణ చికిత్స అందిస్తున్నామని, అవసరమైతే శస్త్రచికిత్సలను కూడా ఉచితంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం బాల్యవివాహాల రహిత గ్రామంగా ఎంపికైన పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ కు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్‌ను అందజేశారు. బాల్యవివాహాల నిర్మూలనలో గ్రామ ప్రజలు చూపిన చైతన్యం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ రావు,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు రైతులకు న్యాయం చేస్తాం

**పెద్దపల్లి ప్రతినిధి ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి:** పెద్దపల్లి నియోజకవర్గంలో గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని, రైతు సమస్యలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.మంగళవారం పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు, కూరమపల్లి, అందుగులపల్లి, దేవునిపల్లి, రంగాపూర్, గౌరెడ్డిపేట, ముత్తారం, హన్మంతునిపేట, చీకురాయి గ్రామాల్లో సింగిల్ విండో & HACA ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రంగాపూర్ గ్రామంలో 30 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కటింగుల పేరుతో రైతులను దోపిడీ చేశారని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తూ, కొనుగోలు జరిగిన వెంటనే ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నదని తెలిపారు.రైతు భరోసా పథకం విషయంలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని కోరుతూ, విడతల వారీగా నిధులు విడుదల అవుతున్నాయని వివరించారు. వరి పంటపై ఆధారపడకుండా పంటల మార్పిడి చేపట్టాలని, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచితే భూసారం మెరుగుపడుతుందని సూచించారు.పెద్దపల్లి అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, సింగిల్ విండో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మే 6న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి)



నైపుణ్య విజ్ఞాన సంస్థ మరియు డీట్ సంయుక్త ఆధ్వర్యంలో మే 6న జిల్లా కేంద్రంలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 57 ప్రముఖ బహుళజాతి మరియు స్వదేశీ సంస్థలు పాల్గొంటున్నాయి. టెలికాం, కమ్యూనికేషన్, కస్టమర్ సపోర్ట్, బిపిఓ, సేల్స్ అండ్ మార్కెటింగ్, డిజిటల్ సర్వీసెస్, ఫీల్డ్ ఆపరేషన్స్ వంటి విభిన్న రంగాల్లో మొత్తం 1799 ఖాళీలను ఈ మేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసీ, ఇంజనీరింగ్, ఎంబీఏ చదివిన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ వెంట విద్యార్హత ధృవీకరణ పత్రాలు, రెజ్యూమ్‌లతో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు ముందుగా డీట్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా యువతను పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది, వారికి గౌరవప్రదమైన ఉపాధి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ మేళాను కూడా యువత పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు

# నిరుపేద యువతి వివాహాలకు సదయ్య గౌడ్ అండ

**సుల్తానాబాద్, ఏప్రిల్ 28: (ప్రజా జ్యోతి)**

మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డులో ఎస్సీ నిరుపేద యువతుల వివాహాలకు ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సదయ్య గౌడ్ అండగా నిలిచారు. ఈ సందర్భంగా పెళ్లికూతుళ్లకు చీరలతో పాటు బియ్యాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సదయ్య గౌడ్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలోని నిరుపేద వర్గాలకు సహాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన వారు ట్రస్టు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో న్యాతరి ప్రభాకర్, న్యాతరి శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమం విజయవంతం



**ముస్తాబాద్, ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి):**రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండలం, బందనకల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఈరోజు (28.04.2026) "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు - అన్నదాతల అవగాహన కార్యక్రమం" విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం "అన్నదాతల అభివృద్ధి కార్యక్రమం (ఏప్రిల్ 27 - మే 23, 2026)"లో భాగంగా జరిగింది.ఈ సందర్భంగా డా. జి. ప్రియదర్శిని (అసిస్టెంట్ ప్రొఫెసర్) మరియు ఎం. సంధ్యా (టీచింగ్ అసోసియేట్) రైతులకు ఆరు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చుల తగ్గింపు, నేల ఆరోగ్యం పరిరక్షణ, పంట మార్పిడి విధానం, సాగునీటి ఆదా మరియు సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు.వ్యవసాయ అధికారి (ఏ ఓ ) అనుషా ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సబ్సిడీలు మరియు వాటి ద్వారా రైతులకు లభించే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించి, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారి డి. హరీష్ పంటల విభిన్నీకరణలో భాగంగా ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యతను వివరించి, దీని ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.విద్యార్థులు బి. సుష్మ తేజ, డి. అఖిల, పి. శ్రీధర్ వర్మీ కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించి, సేంద్రియ ఎరువుల తయారీ విధానం మరియు ఉపయోగాలను వివరించారు.గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ కార్యక్రమంలో పాల్గొని, రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించి వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సుమారు 50 మంది రైతులు హాజరై, కార్యక్రమంపై సానుకూలంగా స్పందించారు. తమ అభిప్రాయాలు, ఆశలు పంచుకుంటూ, మరింత అభివృద్ధి కోసం సూచనలు చేశారు. రైతుల్లో అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు.

## బీ ఆర్ ఎస్ కార్యకర్త పార్థివ దేహానికి నివాళులర్పించిన బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు



**ఇల్లంతకుంట ఏప్రిల్ 28(ప్రజా జ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్ల ఇల్లంతకుంట మండలం పోతూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ కార్యకర్త సోషల్ మీడియా వారియార్ బండారి శ్రీకాంత్ గౌడ్ సోమవారం రోజుఆకస్మాత్తుగా గుండెపోటుతో మరణించగ మంగళవారం రోజు పోతూరు గ్రామంలో శ్రీకాంత్ పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకి మనోధైర్యాన్ని కల్పించిన రాజన్న సిరిసిల్ల బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగన్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బి ఆర్ ఎస్ నాయకులు

## పేదలకు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం

### పై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్



**వేములవాడ,ఏప్రిల్,28:ప్రజాజ్యోతి.**ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వ హిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున లక్ష్మీ గణపతి రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటిఅన్న దాతలుగా* చిన్నారులు పిప్పరి మోక్షిత్ మహీరాల పుట్టినరోజు సందర్భంగా వీరి అమ్మ నాన్న పిప్పరి మల్లేశం సుజాత దంప తులు శాశ్వత అన్న దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహలత దంపతులు ప్రతాప స్వప్న సంపత్ దంపతులు నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు గజాచారి శైలజ సాంబశివు దంపతులు దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు రామదుగు శ్రీలత కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు శిరీష సాయిచంద్ర దంపతులు శర్వాణి రవిచంద్ర దంపతులు శ్రీహర్ష, సాయి కృష్ణ ఉన్నారని మీ ఇంట్లో జరిగే శుభ కార్యాలకు ఇతరత్రకార్య అన్నార్తులకు అన్నదానం చేయలను కునే దాతలు నంబరు 9246939388కు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ట్రస్టు సభ్యులు చంద్రశేఖర్ సగ్గు శివకుమార్ పాల్గొన్నారు

## గుండెపోటుతో మృతి

**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపెల్లి గ్రామానికి చెందిన పొన్నాల వెంకట్ రెడ్డి మంగళవారం తెల్లవారుజామున మలేషియాలో గుండెపోటుకు గురై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకట్ రెడ్డి కుటుంబం ఇటీవల స్వగ్రామానికి వచ్చి కొద్ది రోజులు గడిపి తిరిగి ఉపాధి నిమిత్తం మలేసుకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. అకస్మాత్తుగా ఆయన మృతి వార్త రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు వినిపిస్తున్నారు. వెంకటరెడ్డి మృతదేహాన్ని త్వరగా స్వగ్రామాన్ని తరలించాల చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మరియు సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు కు వాట్సప్ ద్వారా సర్పంచ్ రమేష్ పొన్నాల మనమ్మ తదితరులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని త్వరగా పంపించుటకు సహకరించాలని గ్రామస్తులు ప్రజలు కోరుకుంటున్నారు.



## పంట మార్పిడితోనే అధిక లాభాలు

### రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల సూచన

**వేములవాడ,ఏప్రిల్,28:ప్రజాజ్యోతి.**

తిప్పాపురంలో రైతులకు అవగాహన సదస్సురైతుల ఆదాయాన్ని పెంపొందించడం మరియు భూసారాన్ని సంరక్షించడమే లక్ష్యంగా వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపురం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి డా.ఆర్.సాయికుమార్ మాట్లాడుతూ..రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని కోరారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలుపుతూ, మట్టిలోని పోషకాల ఆధారంగా ఎరువులను వాడాలని సూచించారు. డ్రిప్ మరియు స్ప్రింక్లర్ వంటి తుంపర సేద్యం పద్ధతులను అవలంబించాలని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఏఈఓ రాజు మరియు శాస్త్రవేత్తలు రైతులు అడిగిన వివిధ సందేహాలకు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, శాస్త్రవేత్తలు సూచించిన మెళకువలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.



## అన్నదాతను ఆదుకోమంటే ఈ అక్రమ అరెస్టు లేంది

**చొప్పదండి, ఏప్రిల్ 28(ప్రజా జ్యోతి):** ధాన్యం కాంటాకు తంటాలెంటని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రైతులు స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి చొప్పదండి పట్టణంలో మంగళవారం ఎన్టీఆర్ విగ్రహం దగ్గర రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు.పోలీసులు రైతులను, బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ధాన్యం లిఫ్టింగ్కు ఆన్లైన్ ట్రక్కోట్లు, జీపీఎస్ నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేసారు.వడ్ల కొనుగోలులో ప్రభుత్వం నిబంధన జీపీఎస్, ఆన్లైన్ ట్రక్ పేరుతో అనేకమైన ఇబ్బందులు వస్తాయని అన్నారు.జీపీఎస్, ఆన్లైన్ ట్రక్ రవాణాకు తప్పనిసరి చేస్తే, ట్రాక్టర్కు రూ.4 వేల వరకు ఖర్చు రైతులకు భారం పడుతుందని అన్నారు..ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతో ఇప్పటికే అన్నదాతలకు శాపంలా మారిందని, కొనుగోలు కేంద్రాల పరిధిలో నేటి నుంచి అమల్లోకి వచ్చే కొత్త నిబంధనలు రైతుల పాలిట శరాఘాతంగా మారే ప్రమాదమున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుండి విముఖత వ్యక్తం అవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు పెడచెవిన పెడుతున్నాయని అన్నారు.వడ్ల కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ట్రాన్స్ పోర్టు చేసే వాహనాలకు జీపీఎస్ విధానం ఏర్పాటు చేయాలనే నిబంధనను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద కారణాల వల్ల కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని,ఈ పరిస్థితుల్లో కొత్త నిబంధనలు పెట్టడం వల్ల రైతులకు ఇబ్బందులు కలిగే అవకాశాలున్నాయని,కెసిఆర్ ప్రవేశపెట్టిన పాత నిబంధన ప్రకారమే,వర్షాలు రాకముందే కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేసి అన్నదాతలను ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు తీవ్రతరం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**సుల్తానాబాద్, ఏప్రిల్ 28: (ప్రజా జ్యోతి)** మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపల ప్రకాష్ రావు ప్రారంభించారు.నారాయణపూర్, కొదురుపాక, దేవునిపల్లి, చిన్నకల్వల, చిన్నబొంకూర్, మియాపూర్, పెర్కపల్లి, రెబల్ దేవ్‌పల్లి గ్రామాల్లో సింగిల్ విండో సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రకాష్ రావు మాట్లాడుతూ రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. కనీస మద్దతు ధర ప్రకారం పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహిస్తామని తెలిపారు. తూకం, తేమ కొలతలను కచ్చితంగా పరిశీలించి, వెంటనే రశీదులు అందజేస్తామని చెప్పారు. రైతుల పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి. వెంకటేశ్వర్లు, సంఘ అధికార ప్రతినిధి ఎండి ముఫాసిరుద్దీన్, సీఈవో రమేష్, శ్రీగిరి శ్రీనివాస్, దామోదర్ రావు, చిలక సతీష్, పన్నాల రాములు, మోహన్ రావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎంఈఓ శ్రీనివాస్



**కథలాపూర్, ఏప్రిల్ 28(ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని సిరికొండ జెడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాల సంయుక్తంగా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ ముదాం రవి, చిట్యాల మల్లయ్యతో కలిసి ఎంఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తోందని తెలిపారు. విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు ఇవ్వనుందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి చంద్రశేఖర్, అనిత, విజయ, శ్రీలత, భవాని, నాగేష్, లక్ష్మీనారాయణ, మణికంఠ, విజయ్ పాల్గొన్నారు.

## అగ్రహారంశ్రీజోడాంజనేయస్వామి ని దర్శించుకున్న డి.ఎస్.పి నాగేంద్ర చారి



**వేములవాడఏప్రిల్,28:ప్రజాజ్యోతి.**వేములవాడఅర్బన్ మండలం అ గ్రహారంగ్రామంలోనిశ్రీజోడాంజనేయ స్వామిని సిరిసిల్ల డి ఎస్ పి నాగేంద్ర చారి మంగళవారం రోజు న దర్శించుకుని మొక్కులు చెల్లిం చుకున్నారు, ఆలయ పూజారి చెన్నోజుల లక్ష్మ ణశర్మ ఈసందర్భంగా శ్రీ జోడాంజనేయ స్వామికి ప్రత్యేక పూజ లు చేసి వారి పేరిట అర్చనలుచే సి హారతి నిచ్చి డి.ఎస్.పి నాగేం ద్ర చారి ఎల్లారెడ్డిపేట సీ ఐ వెంక టేష్ కు తీర్థప్రసాద లు అందజేశా రు అనంతరం ఆలయ ప్రాంగణం లో డి ఎస్ పి నాగేంద్రచారి సీ ఐ వెంకటేష్ కు ఆశీర్వచనములు ఇచ్చారు

## పిఎస్ఆర్ వివాహ వార్షికోత్సవ వేడుకలు,



**ఎండపల్లి,ఏప్రిల్ 28, ప్రజా జ్యోతి** మండల వ్యాప్తంగా పి ఎస్ ఆర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి, బడుగు బలహీన వర్గాల ప్రజల కుఅండగా నిలుస్తూ, ఆపదలో నేనున్నానంటూ ఆర్థిక భరోసా కల్పిస్తూ చేయూత అందిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పొనుగోటి మంజుల శ్రీనివాసరావు( పిఎస్ఆర్) దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను మండలంలోని రాజారాంపల్లి లో మహిళా సంఘాల ప్రతినిధులు ఎదుల కల్పన ఆధ్వర్యంలో మహిళలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.కేకు కట్ చేసి పండ్లు పంపిణీ చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో ఏదుల కల్పన, ముక్కెర స్వాతి, జల్లెల్ల స్రవంతి,పసుపులేటి వైష్ణవి,మాచర్ల వైష్ణవి,బొంగాని సుధీష్ణ గన్నేరువరం శిరీష, కంబల్ల అర్చన,గన్నేరువరం లక్ష్మీ ప్రసన్న,తదితరులు పాల్గొన్నారు,

## సన్న వరి సాగుకు సూచనలు



**కొడిమ్యాల,ఏప్రిల్ 28,(ప్రజా-జ్యోతి):**రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొడిమ్యాల,పూడూరు,తిర్మలాపూర్ రైతు వేదికల్లో రాబోయే వానాకాలంలో సన్న రకాల వరి సాగుచేయాలని రైతులకు సూచించారు. బీపీటీ5204, తెలంగాణ సోనా, హెచ్ఎమ్టి, జై శ్రీరామ్, జగిత్యాల సన్నలు వంటి సన్న రకాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరించారు. నానో యూరియా వినియోగం, ప్రకృతి వ్యవసాయంలో సాధిస్తున్న విజయాలను వీడియో ద్వారా చూపించి రైతులకు అవగాహన కల్పించారు.అధికారి పి.జ్యోతి, ఏఈవోలు రాజేష్, శ్రీలత, గ్రీష్మ, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

**మల్యాల,ఏప్రిల్ 28, ప్రజా జ్యోతి:** కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు ఐఏఎస్ మంగళవారం సందర్శించారు. ఆయనతో పాటు ధార్మిక సలహాదారు గోవిందహరి పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన కమిషనర్‌కు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తరువాత మహా మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎస్. అంజనారెడ్డి కమిషనర్‌కు శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.



# రసాయన ఎరువులు తగ్గిస్తేనే లాభదాయక వ్యవసాయం

**బుగ్గారం, ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి):** వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులను నియంత్రించాలంటే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ, సేంద్రియ పద్ధతులను విస్తృతంగా అవలంబించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సూచించారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని బుగ్గారం గ్రామ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి సాగులో సన్న గింజ రకాల ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని, మార్కెట్‌లో మంచి ధర లభిస్తున్నందున రైతులు ఈ రకాల వైపు దృష్టి సారించాలని సూచించారు. సమగ్ర



పంట యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడి పెరగడంతో పాటు నేల సారాన్ని కూడా కాపాడుకోవచ్చని వివరించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ, ఈ విధానంలో సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శాస్త్రవేత్త డా. మధు బిందు మాట్లాడుతూ "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా రైతులు తమ సందేహాలను నేరుగా నిపుణుల వద్ద నివృత్తి చేసుకునే అవకాశం ఉందన్నారు.వరి సాగులో పాటించాల్సిన శాస్త్రీయ విధానాలను వివరించిన ఆమె, పంటకు ముందు పచ్చిఎరువులు వేయడం, యూరియా వినియోగాన్ని తగ్గించి సిఫార్సు మేరకు విడతల వారీగా ఉపయోగించడం, ఆరుతడి పద్ధతిలో నీటి యాజమాన్యం చేపట్టడం, కాలి బాటలు ఏర్పాటు చేయడం వంటి చర్యలను అనుసరించాలన్నారు. అదేవిధంగా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే ఖర్చులు తగ్గి, దిగుబడి మెరుగుపడుతుందని వివరించారు.జిల్లాలోని ఇతర రైతు వేదికల ద్వారా కూడా ఇలాంటి అవగాహనా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, సేంద్రియ సాగు వైపు రైతులను ప్రోత్సహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అక్షిత, సర్పంచులు నక్క రాజవ్వ, గాదె మహేశ్, గట్టు, లావణ్యశ్రీనివాస్, హార్టికల్చర్ విస్తరణ అధికారి వంశీ, నవీద్, శ్రీనివాస్, విద్యార్థులు కావ్యశ్రీ, రచన, అరుణ్, అనికేత్ పాల్గొన్నారు.

## కొండగట్టు పారిశుద్ధ్య కార్మికుల ఆనందోలత్సాహం

**కొడిమ్యాల,ఏప్రిల్ 28,(ప్రజాజ్యోతి):** రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొడిమ్యాల,పూడూరు,తిర్మలాపూర్ రైతు వేదికల్లో రాబోయే వానాకాలంలో సన్న రకాల వరి సాగుచేయాలని రైతులకు సూచించారు. బీపీటీ 5204, తెలంగాణ సోనా, హెచ్ఎమ్టి, జై శ్రీరామ్, జగిత్యాల సన్నలు వంటి సన్న రకాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరించారు. నానో యూరియా వినియోగం, ప్రకృతి వ్యవసాయంలో సాధిస్తున్న విజయాలను వీడియో



ద్వారా చూపించి రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి, ఏఈవోలు రాజేష్, శ్రీలత, గ్రీష్మ, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ శిక్షణ రెండో రోజు

**కొడిమ్యాల, ఏప్రిల్ 28,(ప్రజాజ్యోతి):** సెన్సస్-2027లో భాగంగా మండలం పూడూర్ జెడ్పి హైస్కూల్లో ఇండ్ల గణన కోసం ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు రెండో రోజు శిక్షణ నిర్వహించారు.

ఇండ్ల గణన విధానం, డిజిటల్ ఎన్యూమరేషన్, మొబైల్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించి, ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. గృహ వివరాల ఖచ్చితత్వం, నాణ్యమైన డేటా సేకరణపై దృష్టి పెట్టాలని సూచించారు.శిక్షణను సద్వినియో



గం చేసుకుని బాధ్యతగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ నరేష్ కోరారు. అలాగే సెల్ఫ్ ఎన్యూమరేషన్‌ను సిబ్బంది పూర్తి చేసినట్లు తెలిపారు. ఎంపీఎస్ఓ, ఫీల్డ్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరి స్వీయ గణన..

**జగిత్యాల ప్రతినిధి,ఏప్రిల్28(ప్రజాజ్యోతి):** దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణన 2027లో భాగంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్ లైన్ లో వివరాల నమోదు చేసుకున్నారు.దేశవ్యాప్తంగా ఏప్రిల్ 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు జనగణన చేస్తున్న విషయం తెలిసిందే.. జనగణనలో భాగంగా సంక్షేమ శాఖ మంత్రి జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివరా



లను ఆన్లైన్ లో నమోదు చేశారు. ప్రభుత్వం చేపట్టిన జనగణనకు ప్రతి ఒక్కరు సహకరించి వివరాలను నమోదు చేయాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## కేంద్రాలు తెరిచినా కొనుగోళ్లు శూన్యం

**జగిత్యాల ప్రతినిధి,ఏప్రిల్28(ప్రజాజ్యోతి):** పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ సంబంధిత అధికారులకు రైతులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల ప్రారంభంతోనే సరిపెట్టకుండా, వెంటనే తూకం వేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

**రైతుల ఆందోళన:**



ప్రస్తుతం ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు అకాల మేఘాల వల్ల ఎప్పుడు వర్షం పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోతే కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని వారు భయపడుతున్నారు. ధాన్యం తరలింపులో ఆలస్యం చేసి, ఆ తర్వాత నాణ్యత పేరుతో తూకంలో కోతలు విధిస్తే రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు భారీగా నష్టపోతారని పేర్కొన్నారు. ఎలాంటి కఠిన నిబంధనలు లేకుండా వెంటనే ధాన్యాన్ని సేకరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.ఇప్పటివరకు ఒక్క బస్తా ధాన్యం కూడా కేంద్రాల నుండి బయటకు వెళ్లకపోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, దేశానికి అన్నం పెట్టే రైతన్నను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## ఉపాధి హామీ కూలీలకు ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు డి ఆర్ డి ఓ మచ్చ గీత



**ఇల్లంతకుంట ఏప్రిల్ 28(ప్రజా జ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ గ్రామంలో మంగళవారం రోజు ఉపాధి హామీ కూలిలకు వేసవి కాలంలో ఎండ తీవ్రత నేపధ్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేయడం జరిగిందని డి ఆర్ డి ఓ మచ్చ గీత తెలిపారు. ఉపాధి హామీ జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను ఆమే పరిశీలించారు. పని వద్ద ఉపాధి హామీ కూలీలకు అందిస్తున్న సౌకర్యాలు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె , ఓఆర్ఎస్ ప్యాకెట్స్ గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిది కూలీలకు తప్పనిసరిగా అందివ్వాలని సిబ్బందిని ఆదేశించారు. శశికల, చంద్రయ్య, కుమార్, అజయ్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఐకేపి సీసీ లు రాంచంద్రారెడ్డి, రాజేశ్వరి, వార్డు సభ్యులు దొమ్మాట శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ మమత,ఆశా కార్యకర్తలు, మేట్ లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# 46 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు



**డా. టీ వెంకటేశ్వర్ రావుకు భావోద్వేగ సన్మానం**

**పెద్దపల్లి ప్రతినిధి ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి;**గత 46 సంవత్సరాలుగా నిరంతర వైద్య సేవలందిస్తూ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన డాక్టర్ టి. వెంకటేశ్వర్ రావును సుభాష్‌నగర్ కాలనీవాసులు, ఆయన శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానించారు. త్వరలో హైదరాబాద్‌కు మారనున్న నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో సాగింది.ఈ సందర్భంగా కాలనీవాసులు డాక్టర్‌కు శాలువాలు కప్పి, బొకేలు అందించి, స్వీట్లు తినిపిస్తూ సత్కరించారు. గండు రంగన్న మాట్లాడుతూ, డాక్టర్ వెంకటేశ్వర్ రావు సేవలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని, ఆయన అందించిన వైద్య సేవలు ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు.పేద-ధనిక అనే తేడా లేకుండా అందరికీ సమానంగా సేవలందించిన ఆయన, అనేక కుటుంబాలకు ఆరోగ్యాన్ని అందించిన వైద్యుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు కాలనీవాసులు భావోద్వేగానికి లోనయ్యారు.డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రజల ప్రేమాభిమానాలు తనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, ఇక్కడ గడిపిన అనుభవాలు జీవితాంతం మధురస్మృతులుగా నిలిచిపోతాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ నెలకు ఒకసారి పెద్దపల్లికి వస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉనుకొండ రాజు, ఉనుకొండ మధు, ఉనుకొండ వైకుంఠం, ఉనుకొండ ప్రకాష్, సోడా బాబు, తుమ్మ శ్రీనివాస్ తదితర కాలనీవాసులు




## మాదకద్రవ్యాలు నిర్మూలనపై ర్యాలీ

**గంభీరావుపేట ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి);**
గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఈరోజు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ . విజయలక్ష్మి గారి అధ్యక్షతన, ఎక్స్చేంజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట , గంభీరావుపేట డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు సూచరణ్, ఎన్.ఎస్.ఎస్. పి.ఓ. పాక ధర్మపురి గార్ల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు డ్రగ్స్ వాడటం శారీరకంగా మానసికంగా కృంగిపోయి, తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలియజేశారు. అందువలన ప్రతి ఒక్క విద్యార్థి మాదకద్రవ్యాల వైపు పోకుండా చదువులపై శ్రద్ధ వహించి ఉన్నతమైన జీవితాన్ని స్థిరపరచుకొని భావిభారత పౌరులుగా ఎదగాలని హితవు పలికారు. గంభీరావుపేట మండల రెవెన్యూ ఆఫీసర్ మారుతి రెడ్డి ,ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాస్ మరియు"మా",స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మల్లు గారి నర్సాగౌడ్ గారు డ్రగ్స్ నిర్మూలనపై పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు.1. డ్రగ్స్ ఎస్ అంటే జీవితానికి నో నో అన్నట్టే.2. డ్రగ్స్ వద్దు డ్రీమ్స్ ముద్దు.3. డ్రగ్స్ కు దూరంగా ఉండు. జీవితానికి దగ్గరగా ఉండు. అంటూ ప్రిన్సిపాల్ గారు పిల్లలు చేత నినాదమందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ యం. ప్రభాకర్, కోఆర్డినేటర్ డాక్టర్. వై. ఆంజనేయులు, డాక్టర్ జె శ్రావణ్ కుమార్, డాక్టర్. ఎన్.ఆదివిష్ణు, డాక్టర్ కె.వి. బిక్షమయ్య, శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, మహేష్, దీపికా, భార్గవి విద్యార్థులు పాల్గొన్నారు.

## యాదవ చైతన్య వేదిక బలోపేతమే లక్ష్యం



**ఇల్లందకుంట ఏప్రిల్ 28(ప్రజా-జ్యోతి):**యాదవుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని, బీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని యాదవ చైతన్య వేదిక ఇల్లందకుంట మండల నూతన అధ్యక్షుడు మూడేత్తుల మల్లేశం యాదవ్ పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా ఆయన నియామకం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.మల్లేశం యాదవ్ మాట్లాడుతూ, మండలంలో యాదవ చైతన్య వేదికను గ్రామ స్థాయి వరకు విస్తరించి, యువతను సంఘటితం చేసి బలమైన సంస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. యాదవుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తూనే బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు.చట్టసభల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీ వర్గాలు విభేదాలు పక్కనపెట్టి సమిష్టిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.నాయకులు, కార్యకర్తలు, యువకులు అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు

## తాటిచెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి గాయాలు



**పెద్దపల్లి ప్రతినిధి ఏప్రిల్ 28 ప్రజాజ్యోతి;**
పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన నాగపురి తిరుపతి 48 అనే గీత కార్మికుడు తాటిచెట్టు పై నుండి కిందపడి గాయాలపాయలయ్యాడు. అతన్ని వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గ్రామ సర్పంచ్ సోమకుమార్ మాజీ ఎంపిటిసి తోడేటి తిరుపతి మాట్లాడుతూ నిరుపేద గీత కార్మిక కుటుంబానికి చెందిన నాగపురి తిరుపతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన కుటుంబానికి ఎక్సిగ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.



## వెలిచాలకుపూర్తి బాధ్యత లు అప్పగించాలి

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి )**
కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావుకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించాలని స్థానిక కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డికి కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులు, సర్పంచులు, ముఖ్య నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ వినతి పత్రాన్ని సమర్పించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ఇది కీలకమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితర అధిష్టానం పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.వినతిపై చంద్రశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, అంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, ఆకుల నందిని ఉదయ్, గుమ్మడి రాజకుమార్, కాంతాల జగన్ రెడ్డి, భాస్కర్ నాయక్, గంట శ్రీనివాస్, కల్లేపల్లి శారద, బాలరాజు, పడాల శ్రీజ అజయ్, పడిశెట్టి వసంతలక్ష్మి, భూమయ్య, పర్వతాల మల్లేశం, వరాల నరసింగం, ఇక్రమ్ సికిందర్, మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంటెస్టెడ్ అభ్యర్థులు, సర్పంచులు, మైనార్టీ నాయకులు, ఇతర కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు లు అందే విధంగా చూడాలి



**గంభీరావుపేట ఏప్రిల్ 28(ప్రజా జ్యోతి):**గంభీరావుపేట మండలంలో పనిచేస్తున్న అర్హులైన, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు అందరికీ అక్రిడేషన్ కార్డు లు అందే విధంగా చూడాలని, గంభీరావుపేట ఉమ్మడి జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులుఅరిగే రమేష మంగళ వారం ఆక్రేడిటి షన్ కమిటీ సభ్యులను కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఆక్రెడిటీషన్ కార్డుల కోసం పనిచేస్తున్న కమిటీలు దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధన ప్రకారం పారదర్శకంగా పంపిణీ చేయాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు అందే విధంగా కృషి చేయాలని,ప్రజాస్వామ్యంలో మీడియా కీలకపాత్ర పోషిస్తున్న ఫ్రెంట్ , ఎలెక్ట్రానిక్, మీడియా మిత్రులకు అక్రిడేషన్ కార్డులు అందేలా చూడాలని కమిటీ నీ కోరారు.



## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు మెరుగుపరచాలి: బీజేపీ నేతలు విజ్ఞప్తి

**పెద్దపల్లి, ప్రతినిధి ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి;**పెద్దపల్లి జిల్లా పరిధిలో వడ్లు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానంద సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో రైతులు పండించిన వడ్లు, మొక్కజొన్నను మార్కెట్‌కు తరలించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొనుగోలు కేంద్రాలలో సరైన సదుపాయాలు లేక రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు కల్పించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అదేవిధంగా, కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, నీడ, మంజీరాలు వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు, ధాన్యం తూకం ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు మద్దతు ధర చెల్లించి, వారి ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు.ధాన్యం కొనుగోలు సమయంలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు సిలివేరి ఓదెలు, బూషణవేణి శ్రీనివాస్, మొర మనోహర్, బెట్టి రాజు, కలవేని రాజు పాల్గొన్నారు.

## కేసీఆర్ కప్ క్రికెట్ సామగ్రి పంపిణీ

**ముస్తాబాద్, ఏప్రిల్ 28( ప్రజా జ్యోతి):**క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న కేసీఆర్ కప్-2026 క్రికెట్ పోటీలలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షులు కేటీఆర్ 13 ఎంపీటీసీ గ్రామాల క్రికెట్ జట్లకు అవసరమైన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం యువతలో ఉత్సాహాన్ని నింపడంతో పాటు గ్రామీణ స్థాయిలో క్రీడల అభివృద్ధికి దోహదపడే విధంగా సాగింది. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భోంపెల్లి సురేందర్ రావు, ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఏద్దండి నర్సింహా రెడ్డి, పార్టీ కార్యకర్తలు మరియు సామాజిక మాధ్యమ కార్యకర్తలు బద్దిపడిగే నందు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేసీఆర్ కప్ క్రికెట్ సామగ్రి అందజేసిన కేటీఆర్ కి ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.





## రాములోరి దయతో గ్రామాభివృద్ధి ఆలయ అభివృద్ధికి సహకరిస్తా: ప్రణవ్

**వీణవంక, ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి)**వీణవంక మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.. దేవాలయాలు మానసిక ప్రశాంతతకు ఎంతో తోడ్పడతాయని తెలిపారు.పురాతన కాలం నుండి సీతారాములను పూజించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, ఇలాంటి పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మల్లారెడ్డి పల్లి గ్రామ అభివృద్ధితో పాటు దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వీణవంక మండలం కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ కమ్యూనిటీకి మద్దతుగా ముందడుగు

**పెద్దపల్లి, ప్రతినిధి ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి;**పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలో ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధికి కీలక నిర్ణయం తీసుకోబడింది. కమ్యూనిటీ ఐక్యతకు ప్రతీకగా నిలిచే ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయడం స్థానికుల్లో ఆనందం నింపింది.అలాగే గ్రామ సర్పంచ్ సోమ కుమార్, సంఘ నాయకులు కలవేన మహేందర్, భూతగడ్డ సంపత్‌ల పాత్రను కొనియాడుతూ సొసైటీ తరఫున అభినందనలు తెలియజేశారు.ఈ కమ్యూనిటీ భవనం నిర్మాణంతో గ్రామంలో సామాజిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు సౌకర్యం కలుగుతుందని, ముదిరాజ్ వర్గానికి ఇది ఒక కేంద్ర బిందువుగా మారుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రతి ఒక్కరు తమ హక్కులను తెలుసుకోవాలి

**ఆడెపు వేణు, లోక్ అదాలత్ సభ్యులు**

**గంభీరావుపేట ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి);**ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకొని చట్టపరమైన రక్షణ పొందాలని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది శ్రీ. ఆడెపు వేణు అన్నారు.గంభీరావుపేట మండలంలోని సముద్ర లింగాపూర్ గ్రామంలో మంగళవారం రోజున జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ గారి ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, డి ఎల్ ఎస్ ఏ పి.లక్ష్మణాచారి గారి సమన్వయంతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది.ముఖ్యంగా ఆర్థికంగా బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు అందించడం ద్వారా వారి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా, లోక్ అదాలత్, ద్వారా తక్కువ సమయంలో వివాదాలను పరిష్కరించుకునే అవకాశాల గురించి కూడా ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజలు ఈ శిబిరంలో చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆంజనేయులు, శ్రీనివాస్, , మధుసూదన్, సాయి బాబా రాజారాం, పాల్గొన్నారు.

# మే 5 నిరాహార దీక్షను విజయవంతం చేయాలి

**జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్**



**కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి )** తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మే 5న నిర్వహించనున్న ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి పెద్ద ఎత్తున పాల్గొనాలని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు.ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో భాగస్వామ్య సంఘాలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, అనేక కీలక సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డీఏలు, సంవత్సరానికి ఒకసారి ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు, ఐదు సంవత్సరాలకు ఒకసారి అమలు చేయాల్సిన పీఆర్సీ వంటి అంశాలను సమయానికి అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2023 జులై 1 నుండి అమలు కావాల్సిన పీఆర్సీ ఇంకా అమలుకాకపోవడం గమనార్హమన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం ఇంటరిమ్ రిలీఫ్‌తోనే ఉద్యోగులను సరిపెట్టడం జరుగుతోందని, 2024 జూలై నుండి 2026 జనవరి వరకు రావాల్సిన ఐదు డీఏలను పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని పేర్కొన్నారు. జిపిఎఫ్ నిధులు, సరెండర్ లీవ్ బిల్లులు, టీజీ ఎల్ఐఎఫ్ ఇన్సూరెన్స్ బిల్లులు, వివిధ రకాల ఏరియర్స్ చెల్లింపులు ఆలస్యమవడంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఓపిఎస్ పునరుద్ధరణపై ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కాలేదని, సీపీఎస్ రద్దుపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. హెల్త్ కార్డు పథకం సమర్థవంతంగా అమలు కాకపోవడం, ఎంపానెల్డ్ ఆసుపత్రుల ఖరారు ఆలస్యమవడం వల్ల ఉద్యోగులు వైద్య సేవల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌లో జరుగుతున్న జాప్యంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఒకే స్వరంతో నిరసన వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీనివాస్ రెడ్డి,కాళిచరణ్, రమేష్, కేశవ రెడ్డి, తిరుపతిరావు, జయపాల్ రెడ్డి, సుంకిశాల ప్రభాకర్ రావు, చింతపల్లి అశోక్, కోట రామస్వామి, శంకర్, జాలి మహేందర్ రెడ్డి, జకోజి వెంకటేశ్వర్లు, చంద్రమౌళి డాక్టర్ అరవింద్ రెడ్డి, హర్మీందర్ సింగ్, శారద, సునీత, సరిత, సబిత, సుస్మిత, శైలజ, రాగి శ్రీనివాస్, రమేష్ గౌడ్, మారుపాక రాజేష్, భరద్వాజ్, పోలు కిషన్, వెలిచాల సుమంతరావు, రోహిత్, వెంకట్ రెడ్డి, తాళ్ళపెల్లి రాంమోహన్, బోనాల రవి, వంశీ, లవ్ కుమార్, కరుణాకర్, జీనన్ ఆనందం పాల్గొన్నారు.



## సత్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించిన మేయర్, డిప్యూటీ మేయర్

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 28 (ప్రజా-జ్యోతి )** కరీంనగర్ నగరంలోని రాంనగర్ శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మంగళవారం సందర్శించారు. స్థానిక కార్పొరేటర్ గాజరమ శివరాం ఆధ్వర్యంలో మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ గాజరమ శివరాం మేయర్, డిప్యూటీ మేయర్‌లతో పాటు కోఆప్షన్ సభ్యులను శాలువాలు కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, బండారి వేణు, ఎన్నం లక్ష్మి ప్రకాష్, కోఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ, బర్బీర్ సింగ్, నందకుమార్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసిల్దార్ మారుతీ రెడ్డి

**గంభీరావుపేట ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి):** గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని సముద్ర లింగాపూర్, కొత్తపల్లి లింగన్నపేట గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం రోజున తహసిల్దార్ మారుతి రెడ్డి పరిశీలించారు. ఐకెపి మరియు పిఎస్సి సెంటర్లను సందర్శించి పలు సూచనలు చేశారు. వేసవి దృశ్య రైతులకు కొనుగోలు కేంద్రాలలో నీటి సౌకర్యం గన్ని బ్యాగుల కొరత లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సీసీలకు మరియు సెంటర్ ఇన్చార్జి లకు తెలిపారు.రైస్మిల్లను తనిఖీ చేసి రైతుల నుండి వస్తున్న ధాన్యాన్ని వెంట వెంటనే అన్లోడ్ చేయించాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత రైస్ మిల్లర్ల పైన ఉన్నదని అన్నారు. తాసిల్దార్ వెంట ఆర్ ఐ ప్రశాంత్ ఆయా గ్రామాల సిఏలు, రైతులు ఉన్నారు.

# నాలుగు కర్మకాండ నిలయాల ఏర్పాటుకు ప్రతిపాదన

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 28( ప్రజాజ్యోతి )**కరీంనగర్: నగరంలో పేదలు ఎదుర్కొంటున్న అంత్యక్రియల సమయంలోని ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నాలుగు కర్మకాండ నిలయాల నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచన మేరకు ఈ ప్రతిపాదనను రూపొందించినట్లు అధికారులు తెలిపారు.కిరాయి ఇళ్లలో నివసించే కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఇళ్లలోకి అనుమతించకపోవడం, ఆర్థిక ఇబ్బందుల వల్ల లాడ్జీల్లో ఉండలేకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో స్మశాన వాటికల సమీపంలో కర్మకాండ కార్యక్రమాల కోసం ప్రత్యేక భవనాలు నిర్మించాలని నిర్ణయించారు.ఇందులో భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఇటీవల నగరంలోని సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్ రహదారుల పరిధిలో ఉన్న స్మశాన వాటికలను సందర్శించి అనువైన స్థలాలను పరిశీలించారు. మార్కండేయ నగర్, ఓల్డ్ సిటీ కేబుల్ బ్రిడ్జి సమీపం, అల్కాపురి, రేకుర్తి ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు.స్థలాల ఎంపిక పూర్తయిన తర్వాత నగరంలోని నాలుగు దిక్కుల్లో జీ+1 విధానంలో కర్మకాండ నిలయాలను నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కో భవనానికి సుమారు రూ.50 లక్షల వ్యయం చేయాలని భావిస్తున్నారు. ఈ భవనాల్లో విద్యుత్, నీటి సౌకర్యాలు, బస కోసం అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించనున్నారు.ఈ కర్మకాండ నిలయాలు అందుబాటులోకి వస్తే కుటుంబ సభ్యులు మరణించిన నాటి నుంచి కర్మకాండలు పూర్తయ్యే వరకు గరిష్టంగా 13 రోజులపాటు అక్కడే ఉండే అవకాశం కల్పించనున్నారు. పేదలపై భారం పడకుండా నామమాత్రపు రుసుముతో సేవలు అందించేలా విధానాన్ని రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగర ప్రజలకు ఉపశమనం కలిగించేలా త్వరలోనే స్థలాల ఎంపిక పూర్తి చేసి నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

# కరీంనగర్ కాంగ్రెస్‌లో బూత్ స్థాయి బలోపేతంపై దృష్టి

**ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

- **రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవెయ్యాలి**



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 28( ప్రజాజ్యోతి )** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలంటే ఐకమత్యంతో పని చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ కోఆర్డినేటర్ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి లు పిలుపునిచ్చారు.కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షతన డిసిసి కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ శ్రేణులతో బ్లాక్, మండల, డివిజన్ అధ్యక్షుల నియామకం, బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంపై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ కోఆర్డినేటర్ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి హాజరై పార్టీ నిర్మాణం, బిఎల్ఏ2 నియామకం, క్రమశిక్షణపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కరీంనగర్ నియోజకవర్గంలోని సుమారు 390 బూత్‌లకు సంబంధించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఓటు కీలకమని, గత కార్పొరేషన్ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓటములు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు అనుకూలమైన ఓటు బ్యాంకును కాపాడేందుకు బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలంటే ఐకమత్యంతో పని చేయాలని పిలుపునిచ్చారు.టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో బిఎల్ఏ2 నియామకం తప్పనిసరి అని, ఓటరు జాబితా సమస్యలపై అధికారికంగా ఫిర్యాదు చేయాలంటే బిఎల్ఏ2 ద్వారానే సాధ్యమవుతుందని వివరించారు. కరీంనగర్ పరిధిలోని అన్ని బూత్‌లకు బిఎల్ఏలను నియమించి పార్టీని పటిష్టం చేయాలని అన్నారు.అలాగే 66 డివిజన్లకు కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కార్యవర్గ నియామక ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. పార్టీకి కనీసం మూడు సంవత్సరాలు సేవలందించిన కార్యకర్తలకు అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బ్లాక్, మండల, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జర్నలిస్టు హత్యపై

## జాతీయ మానవ హక్కుల కమిటీ ఆగ్రహం

**రామగిరి, ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి) :** ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా వెంకటగిరి కోట మండలంలో జరిగిన విలేఖరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్య ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను ప్రజాస్వామ్యంపై, ముఖ్యంగా పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా అభివర్ణిస్తూ ఘాటుగా ఖండించింది. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా నిలుస్తూ నిజాలను నిర్భయంగా వెలికితీస్తున్న సందర్భంలో వారిపై దాడులు, హత్యలు జరగడం అత్యంత ఆందోళనకరమని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఓడేటి చంద్రశేఖర్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. వాకింగ్‌కు వెళ్లిన సమయంలో జగన్మోహన్ రెడ్డిని దుండగులు వెంటాడి కత్తులు, వేటకొడవళ్లతో బహిరంగంగా హత్య చేయడం జర్నలిజంపై జరిగిన క్రూర దాడిగా ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలో పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఆయన, జర్నలిస్టుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని, నాన్‌బెయిలబుల్ కఠిన నిబంధనలు అమలు చేయాలని కోరారు. జర్నలిజం ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమని, ఆ స్థంభం కూలిపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతింటుందని, జర్నలిస్టుల రక్షణ బాధ్యత ప్రభుత్వం మాత్రమే కాక సమాజం మొత్తం మీద ఉందని పేర్కొన్నారు.

## బైపాస్ రోడ్డు నిర్మాణంపై మంథని ఎమ్మెల్యే పునరాలోచన చేయాలి

- **రోడ్డున పడనున్న 137 బలహీనవర్గాల కుటుంబాలు**
- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథని, ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి):** మంథని ఎమ్మెల్యేకు దగ్గరి బంధువు భూములకు విలువ రావాలని, రియల్ ఎస్టేట్ చేసుకునేందుకే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బైపాస్ రోడ్డుకు శ్రీకారం చుట్టారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంగళవారం మంథని పట్టణంలోని అంగుళూరు శివారులో శ్రీపాద బైపాస్ రోడ్డు నిర్మాణ జరిగే ప్రాంతం, పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పుట్ట మధుకర్ మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో మంథని ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, ఇది వృదా అని పలుమార్లు ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. బైపాస్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్ల క్రితమే జీఓ వచ్చిందని, ఇప్పటి వరకు భూసేకరణకు డబ్బులు రాలేదని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంలో 80ఎకరాలు, 137మంది రైతు కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ఎమ్మెల్యేకు ఓట్లు వేసింది కాపులు, ఇతర సామాజిక వర్గాలేనని, ఇక్కడ కాపులకు భూములు ఉండవద్దనే ఆలోచనతోనే రోడ్డుకు ప్రతిపాదన చేసినట్లు కనిపిస్తుందని ఆరోపించారు. అయితే ఈ రోడ్డు నిర్మాణంలో నష్టపోయే రైతులంతా బలహీన వర్గాలకు చెందిన వారేనని ఆయన వివరించారు. ఇప్పటి వరకు భూసేకరణకు డబ్బులు రాకున్నా, రోడ్డు ఈ ప్రాంత ప్రజలకు అవసరం లేకున్నా కేవలం ఎమ్మెల్యే బంధువు కోసమే రోడ్డు వేస్తున్నట్లు అర్థం అవుతోందని, ఇప్పటికైనా ఎమ్మెల్యే పునరాలోచన చేసి ఈ రోడ్డు నిర్మాణాన్ని ఆపివేయాలని కోరారు. మంథని ఎమ్మెల్యేకు ఈ మట్టితో సంబంధంలేదని, ఇక్కడ పుట్టలేదని, పెరుగలేదని, ఇంకా ఇక్కడ వ్యవసాయం కూడా లేకపోవడంతో రైతుల బాధలు తెలియవన్నారు. తాను ఇక్కటి మట్టిలో పుట్టి పెరిగామని, ప్రజలతో కలిసి బతుకుతున్నం కనుకనే ఆలోచన చేయమంటున్నామని అన్నారు. మీ బంధువుకు ఏదైనా సాయం చేయాలంటే మీకు ఉన్న ఇండస్ట్రీ, ఐటీలో సాయం చేయండే కానీ రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. మంథని, అంగూళురు, విలోచవరం గ్రామ శివారు రైతులే ఎక్కువగా ఉన్నారని ఆయన వివరించారు. ఎమ్మెల్యే బంధువుతో పాటు కాంగ్రెస్ పార్టీ వాళ్ల కోసం ఇది ఆలస్యం చేస్తున్నారని, ఇందులో ల్యాండ్ మాఫియా కూడా ఉందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్సోళ్ల భూములకు నాలా కన్వర్షన్ చేస్తున్న అధికారులు స్థానిక రైతులకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఉంటే రెండు పంటలు పండుతున్న ఈ భూముల్లో మూడు పంటలు తీసుకోవచ్చన్నారు. పచ్చని పొలాలు హైవేకు దగ్గర ఉన్న ఈ భూములకు మంచి డిమాండ్ ఉండగా కేవలం అవసరం లేని రోడ్డు కోసం గుంజుకునే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఈ ప్రాంతం బాగుపడుతుందంటే మా ఆస్తులు, భూములు తీసుకోవచ్చని, కేవలం తండ్రి పేరుకోసమో, బంధువు భూములకు విలువ కోసమో భూములు తీసుకుంటే ఊరుకునేది లేదన్నారు. ప్రతిపక్షాలు ఏదైనా మాట్లాడితే అందులో వాస్తవాలు, అవాస్తవాలను బేరీజు వేసుకుని వాస్తవాలు ఉంటే గమనించాలని ఆయన హితవు పలికారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం చేస్తే ఈ ప్రాంతానికి నష్టమే జరుగుతుందని, కరకట్టలతో నీళ్లు ఆగి పంటలు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆనాడు ఆరెంద మల్లారం వద్ద కరకట్టల విషయంలో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, దీంతో నాలుగేండ్లుగా పంటలు నీళ్లలోనే మునిగిపోతున్నాయని, అలాంటి పరిస్థితులు మళ్లీ ఎదురవుతాయని ఆయన గుర్తు చేశారు. రెండేళ్లయినా భూసేకరణకు డబ్బులు రాలేదన్న విషయాన్ని గుర్తించి ఉపయోగం లేని రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే ఆపేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే బోయిన్‌పేట, గొల్లగూడెం మీదుగా రింగ్‌రోడ్డు నిర్మిస్తే కొంత మేర అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ప్రజలకు ఉపయోగపడే రీతిలో పనులు చేయాలని, తక్షణమే బైపాస్ రోడ్డు నిర్మాణంపై పునరాలోచన చేయాలన్నారు



## వేములవాడ బద్ది పోచమ్మ ఆలయంలో భక్తులరద్దీ అధికం

**వేములవాడ, ఏప్రిల్, 28: ప్రజా జ్యోతి.** వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ వారి ఆలయం మంగళవారం రోజున భక్తులతో కిటకిటలాడింది సెలవులు కార ణంగా అమ్మవారిని దర్శించుకు నేందుకు మొక్కులు తీర్చుకునేం దుకుభక్తులుమబ్బులఐదుగంటలు నుండే బారులు తీరినారు భ క్తుల రద్దీ అధికమవడం వల్ల దర్శ నము ఆలస్యము అవుతున్నది ఆలయ అధికారులు అన్ని సౌక ర్యాలు కల్పించినారు అమ్మవారికి ఇష్టమైన బోనము వండి బద్ది పోచమ్మ వారికి సమర్పించడం ఆనవాయితీ బోనం మహిళా మణులు భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఉండి సమర్పిస్తారు వివిధ ప్రాం తాల నుండి తరలివచ్చిన భక్తు లు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమ ర్పించి బోనం సమర్పించి వారి కో రికలు తీరాలని కోరుకుంటారు పెద్ద సంఖ్యలో వచ్చిన



## స్వామివారి కటాక్షంతో పల్లె పండుగలా మహోత్సవ వేడుకల సందడి

**వీణవంక, ఏప్రిల్ 28(ప్రజాజ్యోతి )** వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామం అంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది.ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో ప్రజలకు ప్రసాదం పంపిణీ చేశారు. హోమాల్లో ఎస్సై ఆవుల తిరుపతి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు.పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, పల్లెర్ల కిరణ్, ముద్దసాని సమ్మయ్య, గోనెల సమ్మన్నతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.